సర్కార్ చావుతెలివి

- శైలజపై 'రోగ' ముద్ర
- అడిషనల్ కలెక్టర్ నివేదిక
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతిపై సర్కారు 'రోగ' ముద్రవేసింది. గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఇన్ఫెక్షన్ సమస్యకు ఆర్ఎంపీ సిఫారసు చేసిన సూపర్ 'స్పెషాలిటీ' నిర్ధారణగా స్వీకరించింది. తన తప్పు ఏమాత్రం లేదని బుకాయించే ప్రయత్నం చేస్తున్నది. శైలజ మృతికి ఫుడ్‌పాయిజన్ కారణం కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం ఏమాత్రం లేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నది. కుమ్రంభీం-ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలోని బృందం వాంకిడి పాఠశాలలో గత నెల 29 నుంచి చోటుచేసుకున్న పరిణామాలపై అధ్యయనం చేసి జిల్లా కలెక్టర్‌కు ఈ నెల 12న నివేదిక ఇచ్చింది.

నివేదికలో ఏముంది?

'ఇంతకు ముందే గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఇన్ఫెక్షన్ సమస్యతో శైలజ చికిత్స తీసుకున్నట్టు మా దృష్టికి వచ్చింది. దసరా సెలవుల్లో వైద్య పరీక్షల కోసం శైలజ అక్టోబర్ 17న మెడికల్ ల్యాబ్‌కి వెళ్లింది. మల్లికార్జున డయాగ్నస్టిక్స్ (వాంకిడి) క్లినికల్ రిపోర్ట్ ప్రకారం తెల్లరక్తకణాలు(డబ్ల్యూబీసీ) కౌంట్ స్థాయి సాధారణం కన్నా ఎక్కువగా ఉందని(14,200), ఆమెకు ఆర్ఎంపీ చంద్రశేఖర్ చికిత్స అందించి గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఇన్ఫెక్షన్, యాంటీబయాటిక్స్ కోసం ఉపయోగించే మందులను సూచించాడు. ఆమె గత నెల 21న పాఠశాలకు వచ్చింది. అయితే అప్పటికే ఆర్ఎంపీ సూచించిన మందులు వాడుతున్నది. ఈ క్రమంలో.. అక్టోబర్ 29న కడుపునొప్పి, డయేరియా లక్షణాలతో శైలజను దవాఖానలో చేర్చాము. తల్లిదండ్రుల కోరిక మేరకు మంచిర్యాలలోని మ్యాక్స్‌కేర్ దవాఖానలో చేర్చాము. ఆ తర్వాత నిమ్స్‌లో చేర్చి అత్యాధునిక వైద్య చికిత్స అందిస్తున్నాము' అని అడిషనల్ కలెక్టర్ బృందం కలెక్టర్‌కు నివేదిక సమర్పించింది. శైలజతోపాటు 30 మంది అమ్మాయిలకు చికిత్స అందించగా కొలుకున్నారని నివేదికలో స్పష్టంచేశారు.

ఈ ప్రశ్నకు బదులేది?

దసరా సెలవుల తరువాత అక్టోబర్ 21న శైలజ పాఠశాలలో చేరిన రోజు నుంచి 29 వరకు ఎలాంటి ఆరోగ్య సమస్య రాలేదా? శైలజ అస్వస్థతకు ఆమె పూర్వ అనారోగ్యమే కారణమైతే ఆమె డయేరియా బారినపడాలి, మిగతా 29 మంది ఎందుకు దవాఖాన పాలైనట్టు? అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదు.

అడుగడుగునా పోలీసుల గస్తీ..

శైలజ మృతదేహాన్ని వాంకిడికి తరలించే ముందు నుంచే సర్కారు అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచే పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పోలీసులు రాత్రి నుంచే గృహనిర్బంధంలో ఉంచారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను అడ్డుకున్నారు. కొడంగల్ నుంచి ఆసిఫాబాద్ వరకు రేవంత్ సర్కారు అణచివేత చర్యలనే ఆశ్రయించిస్తున్నదని తెలంగాణ సమాజం నిప్పులు చెరుగుతున్నది. కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినప్పటి నుంచి గ్రామం పోలీస్ బెటాలియన్‌ను తలపిస్తున్నది.

శైలజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

శైలజ మృతికి నిరసనగా కెరమెరిలో చేపట్టిన రాస్తారోకోలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మోతీరాం

అంత్యక్రియల పైనా ఆంక్షలు

వాంకిడి నుంచి దాబా గ్రామం వరకు పోలీసులే • మృతురాలు శైలజ ఇంటిచుట్టూ ఎటుచూసినా వాళ్లే

- బిడ్డను కళ్లారా చూసుకోలేని పరిస్థితిలో తల్లిదండ్రులు
- కడసారి చూపునకు బంధువులు కూడా రాలేని దుస్థితి
- ఎక్స్‌గ్రేషియాపై స్పష్టమైన హామీ ఇవ్వని ప్రభుత్వం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లుతో సరిపెట్టిన వైనం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కుమ్రంభీం ఆసిఫాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : వాంకిడి మండల కేంద్రం నుంచి దాబా గ్రామం వరకు పోలీసుల మొహరింపు.. శైలజకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన బంధువులు సైతం గ్రామంలోకి వెళ్లకుండా అడుగడుగునా ఆంక్షలు.. మీడియాకు నో ఎంట్రీ.. మృతురాలి ఇంటిచుట్టూ ఎటుచూసినా పోలీసులు.. 25 రోజులుగా కన్నీళ్లు దిగమింగుకున్న ఆ తల్లిదండ్రులు బిడ్డను కళ్లారా చూసి ఏడువలేని పరిస్థితి.. ఇదీ మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం దాబా గ్రామంలోని శైలజ ఇంటి వద్ద కనిపించిన దృశ్యాలు. కట్టుదిట్టమైన భద్రత, ఆంక్షల నడుమ విద్యార్థిని శైలజ అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీసుల పహారాలో వాంకిడి..

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన శైలజ అంత్యక్రియలు మంగళవారం పోలీసుల భద్రత, ఆంక్షల నడుమ నిర్వహించారు. ప్రజా సంఘాలు, బంధువులు ఆందోళనలు చేయకుండా మొహరించి ఉక్కుపాదం మోపారు. శైలజ మృతదేహం వద్దకు వెళ్లి నివాళులర్పించే అవకాశం కూడా ఇవ్వలేదు. వాంకిడి మండల కేంద్రంలోని ఎంట్రెన్స్ నుంచి దాబా గ్రామం వరకు ప్రధాన కూడళ్లు, మధ్యలో గ్రామాల వద్ద పోలీస్ క్యాంపులు ఏర్పాటుచేశారు. దాబా గ్రామం నుంచి ఎవరూ బయటకు వెళ్లకుండా, బయటి వారు గ్రామంలోకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేశారు. మీడియాపై ఆంక్షలు విధించారు. అంత్యక్రియల కోసం వచ్చిన బంధువులను సైతం అడ్డుకున్నారు.

శైలజకు కన్నీటి వీడ్కోలు..

శైలజ అంత్యక్రియల నేపథ్యంలో ఎలాంటి ఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడబ్ల్యూవో రమాదేవి, వాంకిడి తహసీల్దార్ రియాజ్ అలీ సమక్షంలో గ్రామస్తులు శైలజ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్-టీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, గిరిజన సంఘాల నాయకులు, గ్రామస్తులు శైలజకు కన్నీటి వీడ్కోలు పలికారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లుతో సరి

శైలజ కుటుంబానికి అండగా నిలవాల్సిన అధికారులు కేవలం ఇంట్లో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని చెప్పి సరిపెట్టారు. ఎక్స్‌గ్రేషియాపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో చర్చించిన తర్వాత ఈ విషయం తెలిపారు. శైలజ తల్లిదండ్రులు తుకారాం, మీరాబాయి తమకు ఐదెకరాల భూమి, ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. అధికారులు మాత్రం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇంటితో సరిపెట్టడంపై ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

ఇంతటి నిర్బంధం ఎప్పుడూ చూడలేదు

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఫుడ్‌పాయిజన్‌తో చనిపోతే కనీసం వారి కుటుంబాన్ని పరామర్శించకుండా పోలీసులు ఇంతటి నిర్బంధం పెట్టారు. గతంలో ఎప్పుడూ ఇలా జరుగలేదు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. విద్యార్థి మృతిపై ప్రజాసంఘాలు స్పందించకుండా పోలీసులు ఉక్కుపాదం మోపారు. అర్ధరాత్రి నన్ను హౌస్ అరెస్ట్ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి.

-కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

శైలజ కుటుంబాన్ని ఆదుకోవాలని రాస్తారోకో

కెరమెరి, నవంబర్ 26 : శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి డిమాండ్‌చేశారు. మంగళవారం కెరమెరిలో మాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. శైలజకు సరైన వైద్యం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడాడ్డారు. విద్యార్థి మృతికి బాధ్యత వహిస్తూ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఈ పాపం ఊరికే పోదు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): వాంకిడి గురుకుల విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని, తమ తప్పేం లేదన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరించినంత మాత్రాన విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికేపోదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే దాడులు, ప్రజాప్రతినిధుల హౌస్ అరెస్టులు, మీడియాపై ఆంక్షలు విధిస్తున్న తీరును ఆయన ఎక్స్ వేదికగా ఖండించారు. వాంకిడి గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహా ఇతర ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మీడియాను సైతం గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో బారికేడ్లు వేసి అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యాంగ దినోత్సవం అంటూ దేశ వ్యాప్తంగా గొప్పగా జరుపుకుంటున్నాం కానీ, ఆ రాజ్యాంగ సూత్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నదని మండిపడ్డారు. ఇదేనా ప్రజాపాలనా? నిర్బంధించటమే విధానమా? అని ఆయన ప్రశ్నించారు.

మొద్దు నిద్ర వీడని సర్కారు

వరుస ఫుడ్ పాయిజన్ కేసులతో విద్యార్థులు మరణిస్తున్నా సర్కార్ మొద్దు నిద్ర వీడటం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు వందమంది విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ జరిగి, పది రోజులు కూడా గడవకముందే నారాయణపేట జిల్లా మాగనూరు హైస్కూల్‌లో ఆహారం కలుషితమై 30 మంది విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పితో దవాఖానలో చేరడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థులకు నాణ్యత లేని భోజనం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. ఇంకెంత మంది విద్యార్థులు దవాఖానల పాలు కావాలి? ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలి? అని ప్రశ్నించారు.

● ఇది సాంబారా.. పెసరు పప్పా..?



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. వంటశాలను పరిశీలించారు. అన్నం ఏ మాత్రం ఉడకకపోవడం, పెసరు పప్పు గట్టిగా ఉండాల్సింది పోయి సాంబారు కన్నా పలుచగా ఉండడం, రసం పూర్తిగా నీళ్లలా ఉండడంతో గురుకుల నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. - రాయికల్

పసిప్రాణాలు పోతున్నా చలనం లేదా?: కవిత



హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): పది రోజులకో పసిప్రాణం పోతున్నా సర్కారులో చలనం లేదని, ప్రజాపాలన అంటే ఇదేనా? అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర సర్కారును నిలదీశారు. వాంకిడి విద్యార్థిని శైలజ మృతి చెంది 24 గంటలు గడవక ముందే నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో మరో ఫుడ్ పాయిజన్ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం' అని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

విద్యార్థుల మరణాలు సర్కార్ హత్యలే

- హాస్టళ్ల దుస్థితిపై కనీసం సమీక్ష పెట్టలేదు
- ఈ అంశంపై సర్కార్‌ను చీల్చిచెండాడుతం
- విద్యార్థులూ.. ఆత్మహత్య చేసుకోవద్దు
- ఆరోగ్యం బాలేకుంటే మమ్మల్ని కలవండి
- ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స ఇప్పిస్తం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో ఇప్పటివరకు 48 మంది విద్యార్థులు మరణించారని, అవి సాధారణ మరణాలు కావని, ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిమ్స్‌లో 20 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చనిపోయిన వాంకిడి విద్యార్థి శైలజతోపాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో వివిధ కారణాలతో చనిపోయిన 48 మంది విద్యార్థుల కుటుంబాలకు బీఆర్ఎస్ తరఫున ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలియజేస్తున్నట్టు చెప్పారు. 'ప్రభుత్వమే అన్నీఅయి చూసుకుటుందని తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తే, ఈ సర్కారు 48 మంది పేద పిల్లలను పొట్టన బెట్టుకున్నది. ఇవి మామూలు మరణాలు కాదు.. ప్రభుత్వ హత్యలే.. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయం.. మృతుల కుటుంబాల తరఫున శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తం. చీల్చి చెండాడుతం' అని స్పష్టంచేశారు. సిరిసిల్ల నియోజకవర్గం కోరుట్లపేటలో ఓ విద్యార్థి గురుకుల పాఠశాలలో చనిపోతే ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు ఆ తల్లితండ్రులు తమ లాంటి కడుపుకోత వేరేవాళ్లకు రాకుండా పోరాడాలని కోరారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు గురుకులాల దుస్థితిపై సీఎం ఒక్క సమీక్ష కూడా చేయలేదని మండిపడ్డారు. అంశాలన్నింటిపైనా అసెంబ్లీలో సర్కార్‌ను నిలదీస్తామని, చీల్చిచెండాడుతామని చెప్పారు. కష్టాలు వచ్చినయని విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవద్దని, నిబ్బరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యం బాగాలేకపోతే బీఆర్ఎస్ నేతలను సంప్రదించాలని, ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి మెరుగైన చికిత్స అందిస్తామని పిల్లలకు హామీ ఇచ్చారు.

మా సమస్యలు పట్టించుకోరా?

- బియ్యం నాణ్యత లేకుంటే ఎలా వండుతాం
- కరీంనగర్ డీఈవోతో మధ్యాహ్న భోజన నిర్వాహకుల వాగ్వాదం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, నవంబర్ 26: జనవరి నుంచి తమకు బిల్లులు రాలేదని, తమ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్‌కు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్య అంటే ముందుకు వస్తున్న ప్రభుత్వం తమను మాత్రం పట్టించుకోవడం లేదంటూ డీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో మెనూ ప్రకారం వడ్డించడం లేదని, నాసిరకం బియ్యంతో వండుతున్నారని, ముద్దగా మారిన అన్నం తమకు వద్దంటూ సోమవారం విద్యార్థులు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారం ఆహారం తయారుచేసి విద్యార్థులకు అందించాలని, వారి కడుపు మాడ్చే పని చేయరాదని సూచించారు. స్పందించిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రభుత్వం నుంచి వచ్చిన సరుకుల నుంచే ఆహారం వండుతున్నామని చెప్పారు.

జావలో తెల్ల పురుగులు

విద్యార్థులకు ఎదుగుదలలో భాగంగా గత ప్రభుత్వం రాగి జావ అందించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అందించే జావ ప్యాకెట్లలో తెల్ల పురుగులు ఉండటంతో విద్యార్థులు దాన్ని తాగడానికి నిరాకరించారు. దీంతో ఆ జావను డీఈవో కండ్ల ముందే మధ్యాహ్న భోజన నిర్వాహకులు పారబోశారు.

మళ్లీ ఫుడ్‌పాయిజన్

› మొదటిపేజీ తరువాయి...

విలవిల్లాడారు. వెంటనే వారిని ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న 28 మందిని మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరోవైపు జిల్లా కేంద్రంలోని ఓ బాలికల కళాశాలలో భోజనంలో బొద్దింకలు రావడంతో విద్యార్థులు భయంతో వణికిపోయారు.

వారం రోజులకే మళ్లీ అదే ఘటన

మాగనూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల 20న ఇలాంటి ఘటనే జరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వారం రోజులుగా వారి సమక్షంలోనే విద్యార్థులకు వండిపెడుతున్నారు. తహసీల్దార్ సురేశ్ పర్యవేక్షణలో ప్రతి రోజూ దగ్గరుండి వడ్డిస్తున్నారు. మంగళవారం ఇలానే వడ్డించారు. విద్యార్థులు ఒంటిగంటకు భోజనం చేయగా, మధ్యాహ్నం 3:30 గంటలకు తరగతి గదిలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి అంటూ ఏడుస్తూ బయటకు పరుగులు తీశారు. ఉపాధ్యాయుల ముందే వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు వారిని బైక్‌లు, ఆటోల్లో మాగనూరు పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఇద్దరు విద్యార్థుల పరిస్థితి విషమం

అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 9వ తరగతి చదువుతున్న నేత్ర, రూప పరిస్థితి విషమంగా ఉండడంతో మక్తల్ నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం మక్తల్ ప్రభుత్వ దవాఖానలో 26 మంది చికిత్స పొందుతున్నారు. 12 మంది కోలుకోవడంతో ఇండ్లకు పంపించారు.

పిల్లలకు భోజనం పెట్టడం చేతకాదా: మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. వారం క్రితం ఇదే పాఠశాలలో ఆహారం కలుషితమైనా జాగ్రత్తలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు దగ్గరుండి వంటలు వండిస్తున్నా ఫుడ్ పాయిజన్ ఎలా అయిందని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకపోవడం, నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయకపోవడం, టీచర్లకు, అధికారులకు మధ్య సమన్వయం లోపించడంతో విద్యార్థులు నలిగిపోతున్నారని మండిపడ్డారు.

ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన మాగనూరు పాఠశాల విద్యార్థిని

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యార్థులు దవాఖానల పాలవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు ఒక పూటైనా కడుపునిండా భోజనం చేస్తారనుకుంటే పరుగుల అన్నం పెట్టి వారిని చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చట్నీలో బొద్దింకలు

మహబూబ్‌నగర్ కలెక్టర్ బంగ్లా వద్ద గల ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు మంగళవారం వడ్డించిన చట్నీ, సాంబార్‌లో బొద్దింకలు దర్శనమిచ్చాయి. దీంతో విద్యార్థులు వడ్డించిన భోజనాన్ని పారబోశారు. ప్రతిరోజూ ఇలాగే పురుగులు వస్తున్నాయని, హాస్టల్‌ను ఎవరూ పర్యవేక్షించడం లేదని వాపోయారు. వార్డెన్ అసలు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ ఘటనపై కలెక్టర్ విజయేందిర బోయి ఆరా తీశారు. కూరగాయల్లో బొద్దింకలు వచ్చిన ఘటనపై అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అధికారులు హాస్టల్‌ను తనిఖీ చేశారు. స్టోర్‌రూం, కిచెన్ అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్‌కు నివేదించారు.

రేవంత్ జిల్లాలో రోజుకో ఘటన

సీఎం సొంత జిల్లాలో రోజుకో ఘటన కలకలం రేపుతున్నది. సాక్షాత్తు కొడంగల్ నియోజకవర్గంలో ఇదేవిధంగా ఫుడ్ పాయిజన్ అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వారం కిందట మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన అధికారులు హెచ్ఎం, ఇన్‌చార్జి హెచ్ఎంలను సస్పెండ్ చేశారు.

బేకరీ, కిరాణాల్లో కొనుక్కొని తిన్నందుకే..

మాగనూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం భోజనానికి ముందు 22 మంది వివిధ బేకరీలు, దుకాణాల్లో తినుబండారాలు తిన్నారని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

కిరాణం, బేకరీ షాపుల్లో తనిఖీలు

మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు కారణంపై గ్రామంలోని బేకరీలు, కిరాణా షాపులను అధికారులు తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో అమ్మేవన్నీ నాసిరకం ఫుడ్‌గా తేల్చారు.

ఇటీవల జరిగిన ఫుడ్‌పాయిజన్ ఘటనలు

- **నవంబర్ 20:** మాగనూర్ ఉన్నత పాఠశాల అన్నంలో పురుగులు రావడంతో భోజనం తిన్న 100 మంది విద్యార్థులకు అస్వస్థత. మాగనూరు, మక్తల్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానల్లో చికిత్స.
కారణం: కల్తీ గుడ్లను వాడటంతో ఫుడ్ పాయిజన్
చర్యలు: పాఠశాల హెడ్మాస్టర్ మురళీధర్, ఫుడ్ ఇన్‌చార్జి బాబురెడ్డి సస్పెండ్, వంట ఏజెన్సీ తొలగింపు.
- **నవంబర్ 21:** అదే పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మళ్లీ పురుగులు. అన్నం పారబోసిన విద్యార్థులు.
సొంత ఖర్చుతో విద్యార్థులకు భోజనం పెట్టించిన మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి.
చర్యలు: నారాయణపేట డీఈఓ అబ్దుల్ ఘనీ బదిలీ ఆర్డీవో రామచంద్ర, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ, ఎంపీడీవో ముద్దీన్‌కు షోకాజ్ నోటీసులు.
- **నవంబర్ 26 :** మాగనూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 40 మంది విద్యార్థులకు అస్వస్థత. ఇద్దరి పరిస్థితి విషమం.
- **నవంబర్ 26:** మహబూబ్‌నగర్ ఎస్సీ బాలికల హాస్టర్‌లో చట్నీ, సాంబార్‌లో బొద్దింకలు. ఆహారాన్ని పారబోసిన విద్యార్థులు.. కలెక్టర్ ఆరా.
చర్యలు: కాంట్రాక్ట్ పద్ధతిని పనిచేస్తున్న కుక్ తొలగింపు.. హెచ్‌డబ్ల్యూవో బదిలీకి కలెక్టర్ ఆదేశం.

'మధ్యాహ్న భోజనం' నుంచి మినహాయించండి

- టీచర్లను బోధనకు మాత్రమే పరిమితం చేయండి: తపస్

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ప్రభుత్వాన్ని కోరింది. టీచర్లను బోధనకే పరిమితం చేయాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. కలెక్టర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సస్పెండ్ చేస్తున్నారని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సురేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులు చెల్లించాలని, సస్పెండ్ చేసిన హెచ్ఎంలు, టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వానిదే బాధ్యత

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 26(నమస్తే తెలంగాణ): విద్యార్థుల మరణాలకు కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థిని శైలజ మృతి కలచివేసిందని పేర్కొన్నారు. ఆమె మరణించి 24 గంటలు గడువకముందే మంగళవారం నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాల విద్యార్థులు 30మంది ఫుడ్ పాయిజన్‌తో దవాఖానలో చేరడం సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని దుయ్యబట్టారు.

తల్లితండ్రులకు కడుపుకోత.. ఎవరిదీ పాపం?

- ఎక్స్ వేదికగా దాసోజు శ్రవణ్ నిలదీత



హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనతో నారాయణపేట్ జిల్లా మాగనూర్ ప్రభుత్వ పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్ అయిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 48 మంది విద్యార్థులు మరణించారు. వారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. ఎవరిదీ పాపం? అని ఎక్స్‌లో మండిపడ్డారు.

ముఖ్యవార్తలు ntnews.comలో చూడగలరు

పబ్లిక్ నోటీసు

మేము, గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్, హైదరాబాద్‌లో నివాస నిర్మాణాల కోసం అనేక ల్యాండ్ పార్సెల్‌లను సేకరించామని సాధారణ ప్రజలకు తెలియజేయాలనుకుంటున్నాము. ప్రస్తుతం, మేము తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (TGRERA) వద్ద రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన అనుమతులను పొందే ప్రక్రియలో ఉన్నాము.

మేము సాధారణ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని మరియు మా ఆస్తులను విక్రయించడానికి లేదా విక్రయించడానికి క్లెయిమ్ చేస్తున్న ఏవైనా ప్రకటనల ఏజెన్సీలు, ఛానెల్ భాగస్వాములు లేదా వ్యక్తులతో పరస్పర చర్చకు దూరంగా ఉండాలని మేము ప్రజలను కోరుతున్నాము. ఈ ప్రయోజనం కోసం మేము ఏ మార్కెటింగ్ ఏజెన్సీ లేదా భాగస్వాములకు అధికారం ఇవ్వలేదని దయచేసి గమనించండి.

మా RERA రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు, మా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ఏదైనా మార్కెటింగ్ లేదా ప్రకటనల విషయంలో జాగ్రత్తగా ఉండాలని మేము సూచిస్తున్నాము. ఈ విషయంలో వ్యవహరించే ఎవరైనా వారి స్వంత రిస్క్ మరియు ప్రమాదాలకు గురవుతారు.